యోగ దర్శనము

(పతంజలి యోగ సూత్రములు)

- పాణ్యం రామనాథశాస్త్రి



మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట, రాజమహేంద్రవరం - 533 101.

యోగదర్శనము

(పతంజలి యోగసూత్రములు)

సమాధి, సాధన పాదములు.

★

శ్రీ డా॥ ఇక్బర్ కృష్ణ తైమినిగారి
" The Science of Yoga "
అనే గ్రంథానికి స్వేచ్ఛానువాదం.

★

అనువాదకుడు :


పాణ్యాం రామనాథశాస్త్రి,
అధ్యక్షుడు
రాయలసీమ థియసాఫికల్ ఫెడరేషన్
కోవెలకుంట్ల, కర్నూలు జిల్లా - 518 134.

★

ప్రకాశకులు :

శ్రీ పులిపాటి వేంకటసుబ్బయ్య,
M.A., B.Ed.,
9/825 ఎల్లంబజారు, వరంగల్ - 506002.

1990



पतंजलि

ప్రవేశిక

యోగము అనే మాట నేటి దినాల్లో ఎక్కువ ప్రచారంలోకి వచ్చింది. ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లో యోగశిక్షణ యిచ్చేందుకు భారత దేశం నుండి చాలమంది గురువులు బయల్దేరినారు. ఆ శిక్షణా కేంద్రాలు డబ్బు సంపాదించే వ్యవస్థలుగా మారిపోయాయి. ఇండియాలో కూడా తరచుగా యోగము అనే అంశము ప్రసారమవుతూంది. వీటన్నిటిలో చెప్పేదేమంటే కొన్ని యోగాసనాలు ప్రాణాయామ పద్ధతులు, కొన్ని మంత్రాలు. ఇందులో శిక్షణ పొందేవారు, ఏ నియమాలూ పాటించ నవసరం లేదు. ఆహార విహారాలలో నియమం లేదు. కొంచెం సేపు కన్నులు మూసుకొని ఒక మంత్రాన్ని జపించడం, కొన్ని ఆసనాలు వేయడంతో శిక్షణ ముగుస్తుంది. ఈ మాత్రం చేస్తే మనశ్శాంతి లభిస్తుందని యీ కుహనా గురువులు బోధిస్తున్నారు. కాని యోగమంటే ఏమో తెలుసుకోవాలనే వారి సంఖ్య అతి స్వల్పం. కనుక యోగమంటే ఏమో తెలుసుకునేందుకు ప్రయత్నిద్దాం.

భారతీయ సంప్రదాయంలో ఆత్మోపలబ్ధిని పొందుట కొరకు ప్రముఖమైన మార్గాలెన్నో వున్నాయి. తపస్సంపన్నులగు ఋషిపుంగవులు యీ మార్గాలను క్రమబద్ధం చేశారు. అవి "షడ్దర్శనములు" అని ప్రసిద్ధి గాంచాయి. అవి న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ పూర్వమీమాంస ఉత్తర మీమాంస (వేదాంతము) అనునవి. ఈ ఆరింటిలో యోగమనే దర్శనము పతంజలి మహర్షిచే సూత్రీకరించ బడింది. యోగమనే పదానికి మాతృక "యుజ్" అనే ధాతువు. యుజ్ అనగా కలుపుట లేక సంయోగపరచుట అని అర్థము. రెండు లేక ఎక్కువ విషయాలున్నప్పుడే కలుపుట సంభవించును. ఇక్కడ కలియ వలసిన విషయాలు జీవాత్మ, పరమాత్మ.

ఆదిలో పరమాత్మకు "ఏకోఽహం బహుస్యాం" నేను అనేక మగు
దును గాక అని సంకల్పము కలిగిందని ఉపనిషత్తులు వక్కాణిం
చాయి. అనాది, అనంతుడు, ఏకం, సత్ అని వ్యవహరించబడే ఆ
పరమాత్మకు యీ సంకల్పం కలగడంతో అద్వితీయుడు, అభిన్నుడు
అయిన పరమాత్మనుండి అనేక అంశములు వెలువడ్డాయి. ఆ పర
మాత్మ కల్పించిన ప్రకృతిలో యీ అంశలు తాదాత్మ్యము నంది
జీవాత్మలుగా వ్యవహరించ బడ్డాయి. తాము భగవదంశలను
విషయమును మాయా ప్రభావముచే విస్మరించి తాము వేరు అనే
భావంతో పరిణామాన్ని చెందుతూ వచ్చాయి, ఈ పరిణామంలో
ఒక దశలో మానవుడు (జీవాత్మ) తన స్వభావాన్ని తెలుసుకుని
మరలా పరమాత్మతో ఒక్కటే కావాలని నిశ్చయించి అందుకు కృషి
చేస్తాడు. ఇదే ప్రవృత్తి నుండి, నివృత్తి మార్గానికి వెళ్ళే మలుపు.

స్వభావ సిద్ధంగా జీవులు ఆత్మతో ఏకం కావాలంటే అనంత
కాలం పడుతుంది. కాని స్వప్రయత్నంచే యీ కలయికను ఒకే
జన్మకు లేదా కొన్ని జన్మలకు పరిమితం చేయవచ్చు ఈ ప్రయత్నమే
యోగసాధన. పతంజలి మహర్షి యీ సాధనను అష్టాంగ యోగము
అని పేర్కొన్నాడు. ఈ సాధనలను సులభంగా జ్ఞాపకం చేసు
కొనేందుకు అనుకూలంగా సూత్రీకరించాడు. యమ, నియమ, ఆసన,
ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధులు యీ
ఎనిమిది యోగములకు అంగములు, ఇందులో మొదటి నాలుగు
మనస్సును, శరీరాన్ని నిర్మలము గావించి ధ్యానమునకు అను
కూలించునట్లుగా పరిశుద్ధ పరచును. ఈ నాల్గింటి సాధన ఒకటి
తరువాత ఒకటికాక ఒకే కాలములో నిరంతరము శ్రద్ధాభక్తులతో
అనుష్ఠించవలెనని సూత్రకారుని ఆదేశము, (దీర్ఘకాల నైరంతర్య
సత్కారాసేవితో దృఢభూమిః)

యమం అనగా బాహ్యేంద్రియ నిగ్రహము (అహింస, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము). బాహ్యేంద్రియ నిగ్రహానికి మరెన్నో నియమాలు కలవు కాని సూచన మాత్రంగా వాటిలో ప్రముఖమైన పై ఐదు మాత్రమే పేర్కొనబడినవి. అట్లాగే నియమము. ఇది అంతరంగ నిగ్రహమునకు సంబంధించినది (శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము). మూడవది ఆసనము. ఏ ఆసనములో కూర్చుంటే శరీరము బాధనందదో ఆ ఆసనములో కదలక మెదలక కనీసము ఒక గంటకాలమైనా వుండే ఆ ఆసనమును ఎన్నుకోవాలి. ఆసనములవలన మరియొక ప్రయోజనము శరీరారోగ్యము. హఠయోగములో ఆసనములకు ప్రత్యేకత కలదు. కాని అష్టాంగ యోగములో ఆసనము అనునది కేవలము ఒక అంగము మాత్రమే. స్థిరంగా కూర్చొని ధ్యానము చేయుకొరకు మాత్రమే వుద్దేశించబడినది. అట్లాగే నాల్గవ అంగమైన ప్రాణాయామము కూడ శ్వాస ప్రశ్వాసలగతి సమంగా వుంచేందుకే వుద్దేశించబడినది. హఠయోగమువలె ప్రాణాయామ సాధనవలన మనస్సును నిగ్రహించగల మరొక్క పద్ధతిగలదు. అది హఠయోగము వలె శరీరమునకు కష్టము కలిగించునది. మరియు ప్రమాదకరమైనది. సద్గురువు లేక యీ రెంటిని అభ్యసించిన శరీరారోగ్యము పాడగుటయే కాక మనసుపై కూడ అధికమగు ప్రభావము కలుగును.

పతంజలి మహర్షి నివేదించిన యోగాంగములు శరీరంలోని అంగముల వంటివి. ఏ ఒక్క అంగము శరీరము కానట్లు యీ అష్టాంగ యోగములోని ఏ ఒక్కటీ యోగము కానేరదు. అన్ని అంగములు సమరసంగా వున్నపుడే శరీరము ఆరోగ్యవంతంగా వుండగలదు. అట్లాగే అష్టాంగయోగములోని అన్ని సాధనలు ఒకదానికొకటి తోడై సామరస్య విధానముతో అభ్యసించాలి. ఈ నాలుగు సాధనలు ధ్యాన సాధనకు కావలసిన చక్కటి వాతావరణమును ఏర్పరచ

గలవు. రైతు భూమిని చక్కగా సేద్యము చేసి చదును చేసి, ఎరువు వేసి అంకురారోపణకు తగిన క్షేత్రముగా రూపొందించినట్లు సాధకుడు యీ మానసిక క్షేత్రాన్ని, ధ్యానమనే అంకురార్పణకు తగిన సుక్షేత్రంగా రూపొందించాలి. ఇట్టి సుక్షేత్రములో భగవంతుని దయ గురుకృప అనే వర్షము పడినపుడు ధ్యానమనే బీజము నాటిన అది ఏపుగా పెరిగి పుష్పించి సమాధిలో ఆత్మ సాక్షాత్కారము అనే సత్ఫలాన్ని ప్రసాదిస్తుంది.

ఐదవదియగు ప్రత్యాహార సాధనలో మనసు యింద్రియముల నుండి సంపూర్ణముగా ఉపసంహరించ బడును. ఇంద్రియార్థముల నుండి విముఖమైన మనసు ఏకైక ధ్యాన భూమికపై కేంద్రీకరించ బడును. ఇదియే ధారణ, ఈ ధారణలో ధ్యాన భూమికపై మనసు లయించి దానితో ఐక్యత చెందును. ధ్యానము చేయువాడు, ధ్యానము, ధ్యాన భూమిక అను త్రిపుటి నశించినది. ఈ ఆనందానుభూతిలో పొందిన అనుభవముతో చైతన్యము విశుద్ధమగును. ఈ అనుభూతితో యింకా గుప్తముగా శేషించిన అనేక జన్మ సంసిద్ధమైన కర్మ శేషము దగ్ధమై పోవును. ఈ అనుభూతి శరీరములోని అన్ని అంగములను ప్రకాశింప జేస్తుంది. ఇదియే సమాధి స్థితి. సమాధి స్థితి నుండి మరల మనసును నెమ్మదిగా సామాన్య స్థితికి తీసుకొని రావలసియుండును. ఈ పరిస్థితిలో యే మాత్రము యేమరుపాటు కలిగినా విపరీతమైన అనారోగ్యము, నరముల బలహీనత, మతి భ్రమణము కలుగును. పద్మవ్యూహములోనికి వెళ్ళుట మాత్రమే తెలుసుకొని తిరిగి వచ్చు ప్రక్రియ తెలియక అభిమన్యుడు అంతమొందినట్లు యోగసాధకుడు ఆరోహణ అవరోహణ యీ రెండు పద్ధతులను చక్కగా సద్గురు సన్నిధిలో తెలుసుకొనుట యెంతైన అవసరము. సద్గురువులను పొందుటయే యీశ్వరానుగ్రహము. ఎప్పుడు మనస్సు పరిపక్వమగునో, ఎప్పుడు యోగసాధనకు శిష్యుడు యోగ్యతను పొందునో అప్పుడు దైవానుగ్రహముచే సద్గురువు లభించును.

గురుకృపచే సమాధ్యవస్థనందుకొని ఆత్మసాక్షాత్కారము పొంది సామాన్య స్థితికి వచ్చిన చైతన్యము దేహములన్నిటిని ప్రజ్వలితము చేసి శక్తివంతములు కావించును. సమాధిలో ఎన్నో విభూతులు లభించును. వాటిని తిరస్కరించి యోగసాధన చేయుచు రాగా సాధకుడు 'కైవల్యం' అను స్థితిని పొందును. కైవల్యములో జీవుడు పరమాత్మతో ఐక్యత నొందును. ఇచ్చట రెండు లేవు. వుండేది ఒకటే. సర్వభూతములలో తాను, తనలో సర్వభూతములు దర్శించు వుత్తమోత్తమ స్థితి కైవల్యము. ఈ కైవల్యములో పొందిన జ్ఞానమే దివ్యజ్ఞానము లేక ఆత్మజ్ఞానము. ఈ జ్ఞానాన్ని నిత్యజీవితములో అనుష్ఠించగలుగుటయే 'దివ్యజీవనము'. ఇట్టి దివ్యజీవనము జీవించి తాను తరించి, సోదరమానవులను తరింపజేయుటే యోగము యొక్క పరమలక్ష్యము.

పతంజలి మహర్షి యీ యోగ సాధన విధానమును నాలుగు పాదములలో సూత్రీకరించినాడు. మొదటి పాదము సమాధి పాదము. దీనిలో యాభై ఒక్క సూత్రములు కలవు. యోగమంటే ఏమి? సమాధి స్థితిని పొందుటకు మార్గములు. ఈ మార్గములో పొందు ఆటంకములు, వాటిని తరించు వుపాయములు, సమాధి స్థితిలోని దశలు, నిర్వహించబడినవి. రెండవదియగు సాధనపాదములో యమ నియమాదులను గురించి చక్కగా వివరణ వున్నది. ఈ పాదములో కేవలము యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహారములను గురించి మాత్రమే వివరించబడింది.

ఆంగ్లములో Dr. I. K. Timni గారు రచించిన 'The Science of Yoga' అనే గ్రంథాన్ని ఆధారం చేసుకొని నాకు తెలిసినంతవరకు స్వేచ్ఛానువాదం చేయగలిగినాను. ఈ అనువాదంలో ఆచార్య గోపదేవ్ గారి యోగదర్శనము నాకు ఎంతో సాయపడింది.

ఈ గ్రంథము తెలుగు వారికి ఎంతో వుపకరించ గలదను అభిప్రాయంతో అనువాదం చేసినాను. కాని అనుభవము నా వంతు కాదు. బహుశ; యీ జన్మలో అది లభించదు. మరుజన్మలో లభించిన లభించవచ్చు. దీనికి పరమ గురువుల కృప యెంతేని అవసరము.

పతంజలి మహర్షి కేవలము ఆదిశేషుని అవతారమని ప్రతీతి. వారు శిష్యులకు బోధించునప్పుడు ఒక తెర వేయబడి వుండెడిదట. దాన్ని యెట్టి పరిస్థితులలో తీయరాదు. ఒక శిష్యుడు పొరబాటున ఆ తెరను తొలగించగా ఆదిశేషుని విషాగ్నికి భస్మీకృతుడయ్యెనట. పతంజలి మహర్షి యొక్క చిత్రము అడయారులో భారత సమాజ దేవాలయములో వాయవ్యదిశన వుండు స్తంభముపై మలచబడి యున్నది. అందు ఏడు పడగల శిరస్సులతో మానవ శరీరముగల ఋషిగా పతంజలి మహర్షి చిత్రీకరించబడినాడు.

పతంజలి కాలము క్రీ పూ 10-వ శతాబ్దము అని కొందరు' మరి కొందరు 2-వ శతాబ్దము అని అభిప్రాయ పడుతున్నారు. ఈ పతంజలి మహర్షియే పాణిని వ్రాసిన వ్యాకరణ సూత్రములకు వ్యాఖ్యాత అని కొందరు (పదేన వాచా) ఇతడే చరకుడు అని కొందరు (మలం శరీరస్యచ వైద్యకేన) ఈయనే శంకరాచార్యుల వారికి గురువైన గోవింద భగవత్పాదులని మరికొందరు అభిప్రాయ పడుతున్నారు. ఏదెట్లున్నను పతంజలి మహర్షి యోగ సాధకులకు చేసిన సేవ అపూర్వము. ఈ గ్రంథము తెలుగు నాట ఏ కొద్దిమంది సాధకులకు వుపయోగపడినా నా రచన సార్థకత చెందినదిగా భావిస్తాను.

ఈ గ్రంథ రచనకు ప్రధానముగా రెండువేల రూపాయలు విరాళముగా నొసంగిన కర్నూలు కళాసమితి వారికి నా ధన్యవాదములు. బళ్ళారి సన్మార్గ దివ్యజ్ఞాన సమాజ అధ్యక్షులు శ్రీ సతీష్

చంద్ర అగర్వాలాగారు 500 రూపాయలు విరాళముగ యిచ్చి యున్నారు. కల్లూరు పారిశ్రామికవేత్త శ్రీ కె. రాధాక్రిష్ణయ్యగారు రు. 500/- విరాళము ప్రకటించినారు. వీరికి నా ధన్యవాదములు.

శ్రీ పులిపాటి వెంకటసుబ్బయ్యగారు నాకు దాదాపు 30 సంవత్సరముల సుపరిచితులు, పరిచయమేగాదు, దేహములు వేరైనా ఒకటిగా వ్యవహరించిన సుస్నేహితులము. నా అనారోగ్యము, నా ప్రస్తుత పరిస్థితులు గమనించి, ఈ గ్రంథ ముద్రణము తాము చేయించగలమని ముందుకు వచ్చిన సన్మిత్రులు. వారెన్నో గ్రంథాలను చక్కగా ముద్రింపించగలిగినారు. ఈ గ్రంథానికికూడ ఒక చక్కటి రూపాన్ని ఇప్పించగలరని నా దృఢవిశ్వాసము. వారికి నా అనంత ధన్యవాదములు.

యోగేన చిత్తస్య పదేన వాచాం
మలం శరీరస్య చ వైద్యకేన ।
యోఽపాకరోత్తం ప్రవరం మునీనాం
పతంజలిం ప్రాఞ్జలిరానతోఽస్మి ॥

ఓం తత్ సత్.

కోవెలకుంట్ల,
5—7—90.

పాణ్యం రామనాథశాస్త్రి.

ప్రాసంగి

జీవితము క్షణభంగురము, శరీరాలు రోగాల నిలయాలు, విషయాలు చిత్తపశు వాగురాలు. దారితప్పిన జీవితాలకు ప్రపంచమే ఒక ఎడారి. కావున మానవ జీవితమును పొందినది జీవితమును ధన్యము చేసుకొనుట కనునది ప్రతి మానవుడు హృదయముపైన ముద్రవేసుకొనదగిన విషయము. అట్టి సార్థకతను చూపించునదియే సద్గ్రంథాలు. ఇట్టి సద్గ్రంథాలను, సద్భావాలను సర్వజనులకు బోధించి మార్గనిర్దేశము చేయువారే సజ్జనులు.

ప్రపంచములో మిత్రులులేని వారుండజాలరు. సజ్జనులో దుర్జనులో వారి.వారి అభిమతము ప్రకారము స్నేహితులను కలిగి ఉంటారు. దుర్జనస్నేహమును, సజ్జనస్నేహమును వివరించుచు భర్తృహరి ఇట్లు వక్కాణించినారు.

"మృద్ఘట ఇవ సుఖభేద్యో దుస్సంధానశ్చ దుర్జనోభవతి।
సుజనస్తు కనకఘట ఇవ దుర్భేద్యశ్చాశు సంధేయః॥

అంటే దుర్జన సహవాసము మట్టికుండవంటిది. ఇది సులభముగా పగులుతుంది. అతికించడము అసాధ్యము. సజ్జనస్నేహము బంగారు కుండవంటిది. ఇది సులభముగా పగులదు. ఒకవేళ పగిలినా కరిపించడము తేలిక. అందువలన సజ్జనుల మైత్రి బహుకాలము లేక అనంతకాలమువరకు ఉంటుంది.

బ్రహ్మశ్రీ రామనాథశాస్త్రిగారి మైత్రి బహుకాలము నాటిది. నాకు వారి స్నేహము "కనకఘట ఇవ" వంటిది. నేను కోవెలకుంట్లలో 1950 నుండి 57 వరకున్నాను హైస్కూలులో హిందీ పండిట్‌గా, ఆ సమయములో శ్రీ శాస్త్రిగారితో వారి ఇంటికి వెళ్ళి పరిచయము చేసుకున్నాను. ఆనాటినుండి ఈనాటివరకు మాలో

ప్రేమార్ద్రతలు తరుగకుండా ఉన్నవి. ఆ దినాలలో వారిస్నేహము నా ఉన్నతికెంతో తోడ్పడినది. నా ఆధ్యాత్మ మార్గోన్నతికి గాని, సామాజిక గౌరవాభ్యుదయానికిగాని, ముఖ్యముగా మానసిక శాంతికి, ఆత్మ నిర్భరతకు దోహదము కలిగించినది. ఇద్దరము కలిసి పర్యటన చేయువారము. ఒకరి లోటుపాట్లు నింకొకరు ప్రేమభావముతో చర్చించుకొని శ్రేయోమార్గాభిముఖులగు చుండెడివారము. ఆ విషయాల నన్నిటిని ఇచ్చట కృతజ్ఞతతో స్మరించుచున్నాను.

వీరి సతీమణి శ్రీమతి శాంతమ్మగారు. వారు నిజముగా శాంత స్వరూపులే. సార్థక నామధేయులు. వీరి దాంపత్య మాదర్శవంతమైనది. శ్రీ శాస్త్రిగారు ప్రస్తుతము అనారోగ్యముగానున్నారు. పాతంజల యోగసూత్రములకు డా॥ కె తైమినిగారు ఇంగ్లీషులో వ్యాఖ్య వ్రాసినారు. దానిని శ్రీ శాస్త్రిగారు చక్కగ తెనిగించినారు. వారు "ప్రవేశిక" లో తెలిపినట్లు ఈ గ్రంథములో నాలుగు పాదాలున్నవి. సమాధిపాదము, సాధనపాదము, విభూతిపాదము, కైవల్యపాదము అని వాటిపేర్లు. అయితే ఇందులో రెండు పాదములు మాత్రమే ముద్రింపబడినవి. తరువాత మరల రెండు పాదములు శ్రీ శాస్త్రిగారు వ్రాస్తే అది రెండవభాగముగ ముద్రింపబడుతుంది. దీని ముద్రణకు కాలమును నిర్ణయించలేము. అంతా ఈశ్వరేచ్ఛ. వీరింతకు ముందు "సాధన శోధన", "రామానుజుల చరిత్ర" "దివ్యజ్ఞాన సమాజము" మొదలగు ప్రసిద్ధ గ్రంథములను వ్రాసినారు. గ్రంథములు కావలసిన వారు వారి అడ్రసుకు వ్రాసి వివరములు తెలుసుకొనగలరు.

శ్రీ శాస్త్రిగారి అనారోగ్య పరిస్థితి కారణముగ వారు గ్రంథమును ముద్రించుకొమ్మని నాకు సర్వహక్కులతో సమర్పించుకున్నారు. దానిని నేను ముద్రించుచున్నాను. నేను కూడ ఇంతకు ముందు ఈ క్రింది గ్రంథములను ముద్రించినాను.

1. భాగవత రహస్యోపన్యాసములు మొదటి భాగము రు. 45/-
2. భాగవత రహస్యోపన్యాసములు రెండవ భాగము రు. 50/-
3. అపరోక్షానుభూతి రు. 35/-
4. జీవయాత్ర రు. 5/-
5. ధన్యపథము రు. 5/-
6. ధ్యానమార్గము పంచసోపానము వివరణము రు 8/-
7. నమస్కారము రు. 3/-
8. యావజ్జీవం సుఖం భవేత్ రు. 3/-
9. సంధ్యావందనము (సంకలనము) రు. 1-50
10. జీవయాత్ర - (హిందీ అనువాదము) రు. 4/-

ప్రస్తుతము "త్రిపురా రహస్యము" అను గ్రంథము తెనుగున ముద్రణ కానున్నది. ఇదిగాక "భాగవత రహస్యోపన్యాసములు మూడవ భాగము" కూడ వ్రాయుట ప్రారంభింపడినది. "త్రిపుర రహస్యము"ను ఇచ్చట వరంగల్‌లో అయిదు మాసములు ప్రవచన రూపముగా భక్తులకు వినిపించితిని. వారు దానిని విని "అపారమైన జ్ఞానభాండాగారములు దీనిలో దత్తాత్రేయ స్వాములవారు పరశురామునికి వినిపించినారు. మొదట దీనిని తెనిగించి మాకందించండి. భాగవత రహస్యోపన్యాసములు మూడవ భాగము తరువాత ముద్రింపించండి" అని కోరిరి. వారి కోరిక ప్రకారం ముందు త్రిపురా రహస్యమును వ్రాయుచున్నాను. కొలది దినాలలోనే ఆ గ్రంథము ముద్రితమై పాఠకుల కందింపబడుతుంది. అంతా భగవదనుగ్రహము.

పులిపాటి వేంకటసుబ్బయ్య.

ఓమ్

శ్రీ పాతంజల

యోగదర్శనము

★

శ్లో॥ యోగేన చిత్తస్య పదేన వాచాం
మలం శరీరస్య చ వైద్యకేన ।
యోఽపాకరోత్తం ప్రవరం మునీనాం
పతఞ్జలిం ప్రాఞ్జలిరానతోఽస్మి ॥

ఉపోద్ఘాతము

భారతీయ సాంప్రదాయములో ఆత్మవిచారము గావించుటకు ఆరు దర్శన గ్రంథాలు కలవు. ఇవి 'షడ్దర్శనములు' అని ప్రఖ్యాతి గాంచినవి. ప్రాచీనకాలమునుండి మహర్షులు సత్యాన్వేషణలో గావించబడిన మార్గములు ఆ యా ఋషులు క్రమబద్ధము గావించి, దర్శనములని సూత్రరూపముగ ప్రపంచమున కందజేసిరి. అవి ఈ క్రింద వివరింపబడినవి.

	ఋషి	దర్శనము	గ్రంథము పేరు
1.	గౌతముడు	న్యాయ	న్యాయసూత్రములు
2.	కాణాదుడు	వైశేషిక	వైశేషిక సూత్రములు
3.	కపిలుడు	సాంఖ్య	సాంఖ్య సూత్రములు
4	పతంజలి	యోగ	యోగ సూత్రములు
5.	జైమిని	పూర్వమీమాంస	పూర్వమీమాంస సూత్రములు
6.	బాదరాయణ	ఉత్తరమీమాంస (వేదాంత)	బ్రహ్మ సూత్రములు

సూత్రము:- సూత్రము అనుపదము ఈ విధముగ నిర్వచించబడినది,

శ్లో॥ అల్పాక్షర మసందిగ్ధం సారవ ద్విశ్వతో ముఖం ।
అస్తోక మనవద్యం చ సూత్రం సూత్రవిదో విదుః ॥

తాత్పర్యము.- కొలది అక్షరములు కలదియు, సందేహరహిత మైనదియు, సారవంతమైనదియు, నిరర్థకములు వ్యర్థపదములు లేనిదియు, దోషరహితమైనది, సూత్రము అని, సూత్రముల నిర్వచనము,

సూత్రమనగా దారము, మణులను ఒక సూత్రములో బంధించి, నియమానుసారముగ చేర్చియుంచు రీతిగ అపూర్వములు నిగూఢములైన విషయములను కొద్ది మాటలలో, వ్యర్థపదములు లేక పొందుపరచు విధానము 'సూత్రీకరణము' అని చెప్పవచ్చును, అచ్చు యంత్రములు లేని దినములలో, అపూర్వములైన విషయములను చిన్నచిన్న వాక్యములలో కంఠస్థము చేయుటకు అనుకూలముగ, సూత్రీకరించి, విద్యార్థులచే కంఠస్థము చేయించి, పరంపరగా జ్ఞానమును మనకు మహర్షులు సంప్రాప్తింపజేసిరి, ఈ సూత్రములను శిష్యులకు విశదీకరించిరి.

సూత్రకారులగు మహర్షులు ద్రష్టలు, వారు తాము పొందిన జ్ఞానమును అనుభవమునకు తెచ్చుకొని, ఆ భావమునంతను సూత్రీకరించి, శిష్య పరం పరకు చక్కగా బోధజేసి, వారిని తమంత వారిగ తీర్చి దిద్దుచుండిరి, ఆశ్రమములలోని ప్రకృతి సౌందర్యము ప్రశాంత వాతావరణము, ధ్యానాధ్యయనముల కెంతో అనుకూలించుచుండెడివి. వారి జీవనపద్ధతి అత్యంతసరళమైనది. ఆశ్రమములు, గురుకులములు, మహారాజులచే పోషించబడుచుండెను. అధ్యయనమున కెట్టి అంతరాయము లేకుండ నిర్వహించబడుచుండెను. గురు

వుల వ్యాఖ్యానమును శిష్యులు అత్యంత శ్రద్ధతో మననము చేయు చుండిరి. కాని నేడట్టి బోధకులు ఆశ్రమములు కరువైనవి. ఆ కారణముచే సూత్రములు వ్యాఖ్యానము లేక సుబోధితములగుట లేదు. సంస్కృత భాషను తెలిసిన పండితులు ఆ సూత్రములను చక్కగ అధ్యయనము గావించి, ఆ విషయములను ఆయా భాషలలో చక్కగ వ్యాఖ్యానము చేసియున్నారు. సంస్కృతాంగ్ల భాషలో ఉద్దండులైన శ్రీ ఆచార్య ఇశ్వాల్ కృష్ణ తైమినిగారు పతంజలి యోగ సూత్రములకు అత్యంత సులభశైలిలో ఆంగ్లమున ప్రతిపదార్థము, తాత్పర్యము, వ్యాఖ్యానము రచించిరి. వారి వాఖ్యానమును ఆధారము చేసుకొని, పండిత గోపదేవుగారు తెలుగులో రచించిన 'యోగ దర్శనము' అను ఉద్గ్రంథముయొక్క సహాయములో, ఈ గ్రంథము రచించబడినది. ద్రష్టలైన ఋషుల భావములను ఒక భాష నుండి మరియొక భాషలోనికి అనువదించుటలో, వారి భావములను వ్యక్త పరచుట కష్ట సాధ్యము. కాని దర్శనకారుని అత్యంత సుసూక్ష్మములు సశాస్త్రీయములైన భావములను తెలిసికొని, ఇతరులకు తెలియజేయవలెననెడి ఉత్సాహమే ఈ రచనను ప్రోత్సహించినది. ఆచార్య తైమ్నిగారి వ్యాఖ్యానము ఆంధ్ర సోదరులు చక్కగ అవగతము చేసుకొని ధన్యులు కాగలరని ఆశిస్తూన్నాను.

పతంజలి

పతంజలి మహర్షి చే సూత్రీకరించబడిన దర్శనము, యోగము, పతంజలి అనే పేరు సంస్కృత గ్రంథాల్లో అక్కడక్కడ అగుపడుతుంది. బృహదారణ్యక ఉపనిషత్తులో, కపి గోత్రీకుడైన పతంజలి పేరు ఉటంకించబడింది. మహాభాష్యకారుడైన పతంజలి కాశ్మీరములోని 'గోనార్ద' అను ప్రదేశములో జన్మించెననియు, అతని తల్లి పేరు 'గోనిక' అనియు తన్ను తాను వర్ణించుకొనెను. పరిశోధనలను బట్టి

పతంజలి క్రీస్తుకు పూర్వము 10-వ శతాబ్దములో జన్మించి యుండ వచ్చునని కొందరి అభిప్రాయము. కాని పాశ్చాత్య పరిశోధకులు అతని కాలము క్రీ॥ పూ॥ 250 నుండి 60 సంవత్సరముల మధ్య వుండ వచ్చునని అభిప్రాయ పడుచున్నారు. పతంజలి జీవించి యుండిన కాలమును గురించి అభిప్రాయ భేదములున్నను, పాణిని సూత్రములకు భాష్యము రచించిన పతంజలి మహర్షియే, యోగదర్శన కారుడని చెప్పుటకు యోగ సూత్రములో ప్రార్థనాశ్లోకములోని మొదటి చరణము "యోగేన చిత్తస్య పదేన వాచాం" సుస్పష్టం చేస్తుంది.

పతంజలి మహర్షి ఆదిశేషుని అవతారమని శాస్త్రజ్ఞుల భావము. "హిరణ్యగర్భో యోగస్య, వక్తానాన్యః పురాతనః" అను యాజ్ఞవల్క్యస్మృతి వాక్యము చేతను, యోగదర్శన ప్రథమ సూత్రము 'అథ యోగాను శాసనం' అను సూత్రములో యోగ పదము ఉపయోగించబడి యుండుటచేతను, ఇది "యోగసూత్రము" అని ప్రఖ్యాతమైనది. ఆదిలో హిరణ్యగర్భుడు రచించెననియు, దానిని మరింత సులభశైలిలో పతంజలి సంగ్రహ పరచెనని, కొందరి అభిప్రాయము. మరికొందరు ఆదిశంకరుల గురువైన గోవింద యోగియే, పతంజలి అని అభిప్రాయపడుచున్నారు.

పాతంజలి యోగ సూత్రములు

సమాధి పాదము

సూత్రము 1 అథ యోగాను శాసనమ్.

ప్రతిపదార్థము — అథ = ఇపుడు, యోగ = యోగముయొక్క అను శాసనమ్ = సమాధి శాస్త్రము. (ప్రారంభించబడుచున్నది)

తాత్పర్యము — సమాధి శాస్త్రము ఇపుడు ప్రారంభించబడుచున్నది.

వ్యాఖ్యానము:— 'అథ' శబ్దముతో యోగసూత్రము లేక వైశేషిక, సాంఖ్య దర్శనములు, బ్రహ్మ సూత్రములు ప్రారంభించబడినవి.

వైశేషికము - అథాతో ధర్మం వ్యాఖ్యాస్యామః.
సాంఖ్యము - అథ త్రివిధ దుఃఖాత్యంత, నివృత్తి రత్యంత పురుషార్థః
బ్రహ్మసూత్రము - అథాతో బ్రహ్మజిజ్ఞాసా.

సంస్కృత భాషలో అథ శబ్దము, అనంతరము, ప్రారంభము, మంగళము మున్నగు అర్థములతో, ఉపయోగించబడుచున్నది. అథ శబ్దము, అధికారమును తెలుపును. అధికారమన, ప్రారంభము. 'అథ' శబ్దము శిష్యులు కోరిన తరువాత అను అర్థముతో ప్రయోగించబడినది అనిగూడ భావించవచ్చును.

యోగము అనగా సమాధి అని వ్యాఖ్యానకర్తలు నుడువుచున్నారు. "యుజ్ సమాధౌ" అను క్రియచే యోగము అను

పదము యేర్పడినది. సమాధి యననేమో, దానిని పొందు ఉపాయము ఏదో ప్రయోజనమేమో తెలుపు విధానము, అనుశాసనము - శాస్త్రమనబడును.

యోగలక్షణము, యోగమునకుపాయములు. యోగ ప్రయోజనాదులు వివరముగ తెలుపుచు, ఋషి ప్రారంభించినాడని భావము.

సూ॥ 2 యోగశ్చిత్త వృత్తి నిరోధః

ప్రతిపదార్థము :- యోగః = యోగము, చిత్త = చిత్తముయొక్క, వృత్తిః = వృత్తులను, నిరోధః = నిరోధించుట,

తాత్పర్యము :- యోగమనగా చిత్తవృత్తులను నిరోధించుట,

వివరణ:-

ఈ సూత్రము అత్యంతముఖ్యమైనది. ఈ సూత్రములో (1) యోగము, (2) చిత్తము, (3) వృత్తులు, (4) నిరోధము అను నాల్గు పదము లున్నవి. ఈ పదములలో ఒక్కొక్క దానిని గురించి తెలిసికొనుటకు ప్రయత్నింతము,

1. యోగము:—

యోగము అనే పదము మొదటి సూత్రములో సమాధి అనే అర్థములో ప్రయోగించబడింది. ఈ పదమునకు మరియొక వ్యుత్పత్త్యర్థము కూడ కలదు. 'యుజ్' అనే ధాతువుకు 'కలుపుట' అనే అర్థం కూడ వుంది. కలుపుట, సంయోగము అనునపుడు రెండు విభిన్న విషయములను సంయోగపరచుట జరుగవలయును. ఈ సంయోగపరచవలసిన విషయములు జీవాత్మ, పరమాత్మలు. జీవాత్మ పరమాత్మల సంయోగపరచు ప్రక్రియ యోగము. జీవాత్మ ప్రకృతిలో పరమాత్మయొక్క ప్రతిబింబము. ఈ రెండు వేరువేరను భావమునకు కారణము అజ్ఞానము లేక అవిద్య. పరిణామములో అవిద్య

క్షీణించుచు రాగా, బింబ ప్రతిబింబములుగా భావించబడే జీవాత్మ పరమాత్మలు వేరుకావను జ్ఞానము కలుగును.

పరిణామములో భగవదంశ వివిధ ద్రవ్యములలో ప్రవేశించి, ప్రకృతిలో చిక్కుపడినపుడు, తాను, పరమాత్మ వేరనుభావము కలుగును. ప్రకృతితో తాదాత్మ్యము చెందుటే అవిద్య. ఈ అవిద్యావరణము తొలగుటచే భేదభావ నిరసనము లభించును. ఈ అవిద్యావరణమును తొలగించు ప్రక్రియయే యోగసాధన, వివిధములగు ప్రకృతి నిర్మితములైన కోశముల అంతరాయమును అధిగమించి, తుదకు తాను (జీవాత్మ) పరమాత్మ ఒకటేయని తెలిసికొనుట, పతంజలి యోగదర్శనము యొక్క పరమావధి. ఈ పరమ లక్ష్యమును పతంజలి 'కైవల్యము' అని అభివర్ణించెను.

2. చిత్తము:—

పరమాత్మ సత్, చిత్, ఆనంద స్వరూపుడు. తన 'సత్' శక్తిచే వివిధ సాంద్రతగల ద్రవ్యములను రూపొందించెను. ఇవియే వివిధ లోకములు (ఆది, అనుపాదక, ఆత్మ, బుద్ధి, మన, కామ భూలోకములు భారతీయ సాంప్రదాయములో ఇవి సత్య, తప, జన, మహ, సువ, భువ; భూలోకములుగా పేర్కొనబడినవి). ఆదిలో, ఈ లోకముల పదార్థము జడముగ నుండెను. ఈ లోకములలోనికి పరమాత్మ తన 'చిత్' శక్తిని ప్రవేశింప జేయుటచే వివిధ లోకములలోని జడముగ నుండెడి ద్రవ్యము చైతన్య వంతమయ్యెను. ఈ వివిధ సాంద్రతగల అన్ని లోకములకు సంబంధించిన చైతన్యవంతమైన పదార్థము చిత్ పదార్థమే. కాని, యోగదర్శనములో, మనో లోకములోని, అశుద్ధ భాగములోని పదార్థము 'చిత్' పదార్థమని వ్యవహరించబడుచున్నది.

జీవుడు అశుద్ధ మనో ద్రవ్యములోను, కామ లోక ద్రవ్యముతోను, భూలోక ద్రవ్యముతో ఉపాధులను నిర్మించుకొని, భూలోక

ములో జీవించుచున్నాడు. జీవుడు తన పూర్వజన్మ కర్మలవలన పొందిన సంస్కారమును పురస్కరించుకొని సమిష్టి మనోమయ లోకములోని ద్రవ్యమును సేకరించి, మనోమయ శరీరాన్ని నిర్మించుకొనెను. ఈ ద్రవ్యముయొక్క స్వభావము చాంచల్యత, ఈ చంచల స్వభావముగల చిత్ పదార్థమును జీవుడు తన ఇచ్ఛాశక్తిచే ఒక రూపముగా నుండునట్లు చేసెను ఇదెట్లు సాధ్యమౌ మన స్థూల దేహ నిర్మాణ పద్ధతిని తెలిసికొనిన, విదితమగును. మన స్థూల దేహము లోని కణములు (cells) ఎపుడను అతివేగముతో సంచలనము చెందుచుండును. కాని ప్రకృతి, ఈ కదలుచున్న అణువులను ఒక రూప మొసంగ స్థిరత్వము కలిగించినది. ఈ విధముగనే, అస్థిరము లగు మనోమయ సూక్ష్మాణువులను జీవుడు తన శక్తిచేత సమ్మిళిత పరచి, దానికొక రూపమునిచ్చి, దానిని తన ఉపాధులలో నొక్కటిగ చేసుకొనగలిగినాడు. ఇట్లు రూపొందించబడిన ఉపాధులలో, అశుద్ధమానసిక శరీరము ఒకటి. దీనిని దివ్యజ్ఞాన పరిభాషలో Lower mind అంటారు. ఈ అశుద్ధ మనోమయ కోశములోని అన్ని అంతస్తులు 'చిత్తము' అని వ్యవహరించబడుతూన్నాయి. ఈ మనోమయ కోశమును జీవుడు తన వ్యవహారములో ఉపయోగించబడినపుడు 'మనసు' అని చెప్పబడుచున్నది.

(P. 15 Science of Yoga)

ఇంతకు 'చిత్తము'నకు ఇదమిత్థమైన నిర్వచనము యోగ సూత్రములలో ఎక్కడ ఇవ్వబడలేదు. యోగసూత్రములలో నాల్గవ భాగమైన కైవల్యపాదములో చూచాయగా, చిత్తము యొక్క స్వభావమును గురించి ఉటంకించబడింది (21, 22, 23 సూత్రములు-కైవల్యపాదము) (Section IV gives some general indications with regard to Chitta, but it does not say, what Chitta essentially, - is - P. 8. Science of Yoga)

చిత్తము మనోమయ ద్రవ్యముతో నిర్మించబడిన ఒక తెర వంటిది. జీవుడు, దీనిని ప్రభావితము చేయును. జీవుని చిత్ శక్తిచే ప్రభావితమైన చిత్తము అను తెరపై, ఇంద్రియముల ద్వారా ప్రతిఫలించబడిన బాహ్య విషయ స్పందములు వివిధ రూపములుగా చిత్తముపై బడుటచే, జీవుని కారూపములు, ఎరుకయగును. ఈ చిత్తము అనెడి తెర ఎట్టి కదలిక లేక నిశ్చలమై, నిర్మలమైనపుడు, అందు ప్రతిబింబించిన బాహ్యావిషయరూపములు, జీవుడు యథాతథముగా, తెలిసికొనును. కాని, ఈ తెర పూర్వజన్మ సంస్కారముల చేత కలుషితమై, సంచలన మొందుచుండిన, ఆ తెరపై బడిన ప్రతిబింబములు అస్పష్టములై, వక్రములై, జీవుని కెరుక యగును. ఉన్నదొకటి జీవుడు తెలిసికొన్నది మరొకటి!

3. వృత్తులు.

'వృత్' అను ధాతువునుండి 'వృత్తి' అను పదము ఏర్పడింది. 'వృత్' అనగా వుండుట (To exist) ఉండుటను తెలిసికొనవలసిన, అది మార్పులు పొందునా, ఎట్టి స్థితిలో నుండెను; అని గూడ విచారించ నగును. ఇక్కడ Modifications (మార్పులు) అను భావముతో ఈ పదము ఉపయోగించబడినది. 'చిత్తవృత్తి' అనగా, చిత్తము ఉండెడి స్థితి, బాహ్యావిషయ స్పందముల వలన చిత్తములో మార్పులు కలుగును. కాని చిత్తవృత్తులు, స్పందములు కావు. గాలి వలన నీటిలో అలలు కలుగును కాని అల గాలికాదు. చిత్తవృత్తులు మనసులో ఏర్పడు ప్రతిబింబములు కావు. (Chitta vritti is not a mental image though it may be generally associated with mental images) కాని మనసులోని ప్రతిబింబములతో సంబంధము కలిగియుండును. బాహ్య విషయ ప్రతిబింబము వలన చిత్తములో ఏర్పడు మార్పులు, చిత్తవృత్తులనబడును.

చిత్తములో కలుగు వృత్తులు లెక్కింప సాధ్యముకాదు. కాని సూత్రకారుడు ముఖ్యమైన వృత్తులను (1) ప్రమాణ (2) విపర్యయ

(3) వికల్ప (4) నిద్ర (5) స్మృతి అని ఐదుగా పేర్కొనినారు. అంతమాత్రమే గాక, ఇవి క్లిష్టములు (Painful) అక్లిష్టములని (Not Painful) అని రెండు తెగలుగా విభజించినారు. ఇవి 5, 6, 7, 8, 9, 10 సూత్రములలో వివరించబడినవి.

4. నిరోధము.

'నిరుద్ధం' అను పదము, నిరోధ అను పదమునకు మాతృక' నిరోధము మూడు విధములుగ వివరించనగును. నిరుద్ధము అనగా control నియంత్రణ అను అర్థములో వాడవచ్చును. ఒక నది దాని యిచ్ఛ వచ్చినట్లు ప్రవహించకుండ ఒక నియమిత విధానములో ప్రవహించునట్లు నియంత్రించుట ప్రథమదశ రెండవదశ ఈ ప్రవాహ మును ఆనకట్ట కట్టి అడ్డగించుట వంటిది. ఈ దశను శాసించుట (ordering) అనవచ్చును. ఇక మూడవ దశలో నీటి ప్రవాహ మును స్తంభింపజేయుట. ఈ నిరోధములోని ప్రథమదశ ప్రత్యా హారము, రెండవదశ ధారణ, ధ్యానము; మూడవదశ సమాధిస్థితి, ఈ మూడు దశలలో చిత్తవృత్తులను నిరోధించ వచ్చును.

సూ॥ 3. తదా ద్రష్టుః స్వరూపే అవస్థానం।

అ॥ తదా = పిదప, (చిత్తవృత్తులు నిరోధించిన తరువాత) ద్రష్టుః = ద్రష్టుః = ద్రష్ట యగు పురుషుడు, స్వరూపే = స్వస్వరూప ములో అవస్థానం = నెలకొని యుండును.

తా॥ చిత్తవృత్తుల నిరోధించుటచే, ద్రష్టయగు పురుషుడు జగద్ద్రిష్టయైన పరమాత్మయందు నెలకొనును ద్రష్టయగు పురుషుని స్వస్వరూపము పరమాత్మ. మాయచే ఈ స్థితి మరుగుపడినది. చిత్త వృత్తి నిరోధము ద్వారా, ద్రష్ట స్వస్వరూప, జ్ఞానమును పొంది అందు నెలకొనును. 'ఇదియే స్వస్వరూపే అవస్థానం''గా సూత్ర ములో చెప్పబడినది.

వ్యాఖ్యానము॥ సూత్రమున నున్న 'ద్రష్టుః' అనుపదమును రెండుమార్లు చెప్పుకొని, అందొకటి జీవాత్మపరముగను, మరియొకటి పరమాత్మ పరముగను చెప్పుకొనిన, భావము మరింత సులభముగ వ్యక్తమగును. అపుడు సూత్రమును "తదాద్రష్టుః, ద్రష్టుస్వరూపే, అవస్థానం" అని చదవవలసియుండును

ఈ సూత్రములో చెప్పబడిన 'స్వరూపే అవస్థానం' అను సత్యము కేవలము అనుభవైక వేద్యము. ఈ విషయము 44, 45 సూత్రములలో వివరించబడినది.

పురుషుడు స్వతః శుద్ధ స్ఫటికమువలె విర్మలుడు. స్ఫటికము సమీపములో ఏ రంగు వస్తువు పెట్టినను స్ఫటికము ఆ రంగు కలదిగ గోచరించును. దాని దగ్గర ఉంచబడిన రంగురంగుల విషయములే వివిధములగు వృత్తులు. ఈ రంగు వస్తువులను తొలగించిన వెంటనే స్ఫటికము దాని స్వస్వరూపమును పొందును. వృత్తులు నిరోధించ బడినపుడు ద్రష్ట దృశ్యము ఒకటగును. ఇట్టి పరిస్థితిలో ద్రష్ట స్వస్వరూపమును పొందినవాడగును.

సూ॥ 4. వృత్తి సారూప్య మితరత్ర।

అ॥ ఇతరత్ర = చిత్తవృత్తులతో కూడియుండు సమయమున, వృత్తి సారూప్యం = వృత్తులతో సమానమైన రూపమును పొంది యుండును.

తా॥ చిత్తవృత్తులతో గూడియున్న పురుషుడు (జీవుడు) ఆ వృత్తుల సమానమైన రూపమును కలిగియుండును.

వివరణ॥ స్వభావతః పురుషుడు నిర్మలుడు, కాని వృత్తుల ప్రభావముచేత, చిత్తవృత్తుల రూపమును పొందును. అతని స్వస్వరూపము మరుగు పడును. ఈ విషయమున ఒక ఉదాహరణచే సువ్యక్తము చేసికొనుటకు ప్రయత్నింతము. ఒక కొలను మధ్యన నీటిలో ఒక విద్యుద్దీపము పెట్టిన, స్వచ్ఛము నిశ్చలమైన, ఆ నీటిలో

ఆ దీపము చక్కగ కాంతివంతముగా అగుపించును. ఆ కొలనులో ఒక యంత్రము నుంచి, నీటిని మథించిన, అందులో ఎన్నో అలలు యేర్పడును. ఆ దీపము కాంతి, అలలపైపడి అలలరూపము ధరించును. విపరీతమగు సంచలనముచే, దీపము అదృశ్యమైనది. యంత్రము పనిచేయుట మానినపుడు, అలలు ఉపశమించి, నీరు నిశ్చలము కాగా, నీటిలోనున్న దీపము స్వప్రకాశముతో గోచరించును.

జీవుడు దీపము. మనసు కొలను వంటిది. వృత్తులు అందులోని అలలువంటివి. ఈ దీపము మనసుచే ఆవరింపబడినది. మనసు బాహ్య విషయ సంసర్గము వలన, వృత్తులు కలుగును. ఆ వృత్తుల ప్రభావముచే జీవుడు మరుగుపడినాడు. ఈ వృత్తులు ఉపశమించగా, జీవుడు అలలులేని నిర్మలమైన నీటిలోని విద్యుద్దీపము వలె ప్రకాశించును.

సూ॥ 5. వృత్తయః పంచతయ్యః, క్లిష్టాః, అక్లిష్టాః।

అ॥ వృత్తయః = వృత్తులు, పంచతయ్యః = అయిదు విధములు (మరియు అవి) క్లిష్టాః = బాధాకరములు, అక్లిష్టాః = బాధాకరములు కానివి.

తా॥ వృత్తులు బాధాకరములు, బాధాకరములు కానివి. ఈ వృత్తులు అయిదు విధములు. అవి ఆరవ సూత్రములో వివరింపబడినవి.

వివరణ॥ వృత్తులు బాధాకరములు, బాధాకరములు కానివని రెండు విభాగములుగా పేర్కొన బడినవి. మరల అవి అయిదు విధములని చెప్పబడినవి కష్టములు కలిగించు వృత్తులు క్లిష్టములు. సాత్త్విక వృత్తులు కష్టములు కలిగించనివి. జీవితములో నూటికి 90 పాళ్ళ వృత్తులు కష్టమునుగాని సుఖమునుగాని కలిగించవు. సుఖ

మును కల్గించు వృత్తులు పరిణామములో దుఃఖమును పొందజేయును. కాబట్టి సూత్రకారుడు వృత్తులు సుఖము, దుఃఖములని విభజించక, అవి దుఃఖమును కల్గించునవి, దుఃఖమును కల్గించనిదని సూత్రకారుని అభిప్రాయము

వీధిలో నడుచుచున్నపుడు మనకు ఎన్నియో విషయములు గోచరించును. ఒక చెట్టు, ఒక పశువు మొదలైనవి. అవి కూడ మనసులో వృత్తులను కలుగజేయును. అవి సుఖ దుఃఖములకు సంబంధించినవి కావు. ఇవి తటస్థములు (Newtral) కనుక ఇట్టి వృత్తులు అక్లిష్టములుగ వర్ణించబడినవి.

ఇంద్రియముల ద్వారా పొందెడి సుఖములు దుఃఖకారణములు. జిహ్వేంద్రియమునకు సుఖానుభవము కల్గించిన పదార్థములను అతిగ భుజించిన అజీర్ణము కలుగును. అందువలన వ్యాధి సంభవించవచ్చును, ఇట్లే ప్రతి ఇంద్రియముచే పొందిన సుఖములు, పరిణామములో దుఃఖములను కలుగజేయును. ఈ కారణముచే సూత్రకారుడు వృత్తులను సుఖ దుఃఖములనిగాక, దుఃఖములు, దుఃఖములు కల్గించనివని రెండు విభాగములుగా విభజించుట యెంతో అర్థవంతముగ నున్నది.

సూ॥ 6. ప్రమాణ విపర్యయ వికల్ప నిద్రా స్మృతయః॥

ఈ వృత్తులు ప్రమాణ, విపర్యయ, వికల్ప, నిద్ర, స్మృతి

వి॥ ప్ర మా ణ ము (Right Knowledge) విపర్యయము (wrong knowledge) ఈ రెండు వృత్తులు బాహ్య విషయ సంసర్గము వలన కలిగినది.

వికల్ప (Fancy) స్మృతి (Memory) అను ఈ రెండు వృత్తులు విషయ సంసర్గము వలన కలుగవు. ఇవి మనసు ప్రభావములచే ఉత్పన్నమైనవి. పూర్వానుభవములను పురస్కరించుట వలన కలిగినవి.

ఒక కథను చదువు చుందుము. అందలి కథావస్తువు చిత్తములో సంచలనము కలిగించును. ఇవి వూహించుటవలన పొందినవి. 'వికల్ప' కక్ష్యకు చెందినవి. అటులనే గతములో పొందిన అనుభవము స్మరించుటవలన చిత్తములో వృత్తులు కలుగును. ఇట్టి వృత్తులు 'స్మృతి' కక్ష్యకు సంబంధించినవి. ఈ పై వృత్తులపై ఇచ్ఛాశక్తి (will power) ప్రభావము కలదు. కాని 5-వ వృత్తియైన, నిద్రలో వ్యక్తియొక్క ప్రమేయ మేమియు లేదు.

ఈ వృత్తులన్నియు అశుద్ధ మనసుకు సంబంధించినవి మాత్రమే. శుద్ధమనసు, విజ్ఞానమయ శరీరములో గూడ వృత్తులు కలుగును. కాని అవి సమాధి స్థితిలో నున్నపుడే తెలియబడును. ప్రకృతము మన శోధన కేవలము అశుద్ధమనసును గురించియే. అశుద్ధ మనసులో కలిగెడి వృత్తులను నిరోధించుటయే యోగదర్శనము యొక్క లక్ష్యము.

సూ॥ 7. ప్రత్యక్షానుమానాగమాః ప్రమాణాని।

ప్రతిపదార్థము:- ప్రత్యక్ష = ఇంద్రియములతో తెలిసికొనుట; అనుమాన = కార్యమునుబట్టి కారణమును వూహించుట; ఆగమాః = ఇతరులవలన తెలియబడునది; ఈ మూడు, ప్రమాణాని = ప్రమాణ మను వృత్తికి సంబంధించినది.

తాత్పర్యము:- ప్రత్యక్ష, అనుమాన, ఆగమము అని, ప్రమాణ మను వృత్తి మూడు విధములు.

వివరణ :-

1. ప్రమాణము:- "ప్రమ" అనగా జ్ఞానము, జ్ఞానమును పొందజేయు సాధనము ప్రమాణము. ఇంద్రియములు జ్ఞాన సాధనములు. కనుక ఇంద్రియములచే పొందు జ్ఞానము ప్రమాణము అని

చెప్పబడుచున్నది. "ప్రత్యక్షము" అనగా కన్నెదుట గోచరమగుట. ఇంద్రియములతో నేరుగా (Direct) తెలిసికొనుట ఈ ప్రత్యక్ష ప్రమాణ లక్షణము.

2. అనుమానము:- కార్య కారణములను, బేరీజు చేసి, జ్ఞానమును పొందుట, విషయములను తెలిసికొనుట. ఉదాహరణము, పొగ దూరముగ కన్పించినది. నిప్పులేనిది పొగ వుండదు. కనుక పొగ 'కార్యము', నిప్పు కారణము. కార్యమును అనుసరించి కారణముండును గాన, ఆ కారణమును తర్కించి తెలిసికొనుట అనుమాన ప్రమాణముయొక్క లక్షణము.

3. ఆగమ:- ఆప్తునిచే తెలిసికొనబడి, ఆతనినుండి జ్ఞానమును పొందు ప్రక్రియ ఆగమ ప్రమాణము. తాను స్వయముగా గాని, కార్య కారణముల పురస్కరించిగాని, తెలియని విషయములను, ఇతరుల ద్వారా తెలిసికొని, వాటి సత్యమును నిర్ధారణ చేయవచ్చును, ఋషులు, పెద్దలు, మన మేలు కోరువారు శీల సంపన్నులు, వేద శాస్త్రములు చెప్పు సత్యములు - ఆగమ ప్రమాణము లనబడును, దీనిని శబ్దప్రమాణమనికూడ అందురు. ఆప్త వాక్యము అనికూడ అందురు.

సూ॥ 8. విపర్యయో మిథ్యాజ్ఞాన మతద్రూపప్రతిష్ఠం ।

ప్రతిపదార్థము:- అతద్రూపప్రతిష్ఠం = విపర్యయము (Wrong Knowledge) అతద్ = అది కాని, రూప = రూపమును, ప్రతిష్ఠం= నెలకొలుపు, మిథ్యాజ్ఞానం = అట్టిది కాని దానియందు అట్టిది యను తెలియబడు భ్రాంతి రూపమైన - వృత్తి - విపర్యయ మనబడును.

సర్పము కాని దానిని సర్పమనియు, వెండికాని దానిని వెండి యనియు, రత్నముకాని గాజుపెంకును రత్నమని భావించుట విపర్యయమను వృత్తివలన కలుగు భ్రాంతియుతమైన భావము దీనినే

Wrong Knowledge అని చెప్పవచ్చును. Wrong knowledge is a false conception at a thing. Whose real form does not correspond to such conception.

, మసక చీకటిలో ఒక వస్తువును మరియొక వస్తువని భ్రమించుట విపర్యయము కాదు.

వికల్పము (Fancy)

సూ॥ 9. శబ్ద జ్ఞానానుపాతీ వస్తు శూన్యో వికల్పః।

వస్తు శూన్యః = వస్తువు లేని (నిర్విషయకమైన) శబ్ద జ్ఞానానుపాతీ = శబ్ద జ్ఞానము కలిగిన వెంటనే కలుగు చిత్తవృత్తి వికల్పః = వికల్ప మనబడును.

వస్తువు లేదు. కాని మాటల సంయోగము వలన మనసులో కలుగు వృత్తి వికల్పము.

An immage conjured up by words without any Substance is fancy.

వివరణ - 7, 8, సూత్రములలో నుదహరించబడిన ప్రమాణ విపర్యయములను వృత్తులకు ఆధారము ఇంద్రియముల చే తెలిసికొన బడు విషయములు ఇంద్రియ గోచరములు కాని, అసలు ఏ విషయ ములు ఆధారముగ లేక, కొన్ని శబ్దములు ఉచ్చరించ బడినపుడు కలుగు చిత్తవృత్తి వికల్పము. ఉదా॥ కుందేటికొమ్ము, గగన కుసు మము, వంధ్యాపుత్రుడు. కుందేటికి కొమ్ము లేదు. ఆకాశములో కుసు మము లుండవు. గొడ్రాలికి సంతతి లేదు కాని ఈ మాటల వలన ఊహించ బడుట చే కలిగిన చిత్తవృత్తి వికల్పము. ఈ వృత్తి విపర్యయ ము కాదు సంశయము కాదు. మాటల కూర్పు ఈ వృత్తికి కారణము, ఈవృత్తికి బాహ్యవిషయములు (objects) ఆధారము కావు. కేవలము కొన్ని శబ్దముల ఉచ్చారణ వినుట వలన కలుగు వృత్తి, వికల్పము.

నిద్ర

సూ॥ 10. అభావ ప్రత్యయాలంబనా వృత్తిః, నిద్రా।

ప్రతిపదార్థము:- అభావ ప్రత్యయ = జాగ్రత్ స్వప్నాది వృత్తుల అభావముగల, వృత్తిః = చిత్తవృత్తి, నిద్ర యనబడును.

ప్రమాణ విపర్యయ, వికల్పములలో ఏదో ఒక విషయము [ప్రత్యయము] ఆలంబముగా నున్నది. కాని నిద్రలో ఈ ఆలంబన లేదు. ఇక్కడ 'నిద్ర' అనగా స్వప్నము లేని నిద్రగా అన్వయము చేసుకొనవలెను.

నిద్రించునపుడు మనస్సు వున్నది. కాని మనసుకు మెదడుకు గల సంబంధము తాత్కాలికముగ విరమింపజేయ బడినది. అందుకే సుషుప్తిలోని అనుభవము స్మృతిపథములోనికి రాదు. కాని నిదుర లేచిన వెంటనే 'నిద్ర' చాల బాగాపోతిని అను జ్ఞానము మనసు మెదడుకు తెలియజేయును. ఈ నిద్ర కూడ మనసులో ఒక వృత్తిని కలుగజేసి యుండుటచేతనే నిద్రానంతరము నిద్ర మంచిదిగా తెలియ వచ్చినది. నిద్రలో చిత్తవృత్తులు జీవుని ప్రమేయము లేక నిరోధించ బడినవి. సమాధిస్థితిలో గూడ చిత్తవృత్తి నిరోధము కాబడినది. సమాధిలో చిత్తవృత్తి, జీవుని ఇచ్ఛాశక్తివలన కలిగినది. నిద్రలో మనసు ప్రకృతి సిద్ధముగా చిత్తవృత్తి నిరోధము కాబడినది. ఈ విషయమును ఒక ఉదాహరణ ద్వారా తెలిసికొనుటకు యత్నింతము. ఒక కారు డ్రైవరు, కారును Start చేసియు, తన శక్తివల్ల దానిని కదలకుండ చేయుచున్నాడు. ఇది సమాధిస్థితిలో పోల్చ వచ్చును. డ్రైవరు తన ఇచ్ఛామేరకు కారును ఆపగలడు, కాని నిద్రలో కారు, అసలు స్టార్టు చేయబడియే యుండలేదు.

సూ॥ 11. అనుభూత విషయా సంప్రమోషః, స్మృతిః

ప్రతిపదార్థము:- అనుభూత విషయ = అనుభవించిన విషయ

ములను, అసంప్రమోషః = దొంగిలించుకొని పోకయుండుట, స్మృతిః = స్మృతి.

వ్యాఖ్య:– 'సంప్రమోష' అనగా చౌర్యముచేయుట అసంప్రమోషః = చౌర్యము చేయబడకుండుట. చోరుడుపొందిన సొమ్మును యజమానికి లేకుండా జేయును. గతములో పొందిన అనుభవము చౌర్యము చేయబడుట యనగా, ఆ యనుభవమును లేకుండ మరపు చెందుట. ఈ భావములో 'అసంప్రమోషః' అనగా ఆ అనుభవము మనసులో గుప్తముగ నుండును. కావలసినపుడు అది లభించును. మనసులో అనుభూత విషయము బహిర్గతము కానంతవరకు అది వృత్తికాదు. కాని అది బహిర్గతమైనపుడు మనసులో వృత్తులు కలుగును. పూర్తిగ మరచిపోవుట, అనుభవము దొంగిలింపబడుటతో సమానము. అది గుప్తముగ నుండుట అసంప్రమోషము. మనసులో గుప్తముగనున్న స్మృతి బహిర్గతమైనపుడు చిత్తములో వృత్తులు కలుగును. అట్టి వృత్తి – స్మృతి.

సూ॥ 12. అభ్యాస వైరాగ్యాభ్యాం తన్నిరోధః ।

ప్రతి॥ తత్ = ఆ చిత్తవృత్తులను, అభ్యాస = సాధన, వైరాగ్యాభ్యాం = రాగరాహిత్యముల చేత, నిరోధః = నిరోధించవచ్చును

వివరణ:– సూత్రకారుడు, వృత్తుల నిరోధము యోగముగా నిర్ణయించి, వృత్తులనగా నేమో వివరించి, వృత్తి నిరోధము, అభ్యాసము, వైరాగ్యములచే గావించవచ్చునని, ఈ సూత్రములో విశదీకరించినాడు.

సూ॥ 13. తత్ర స్థితౌ యత్నోఽభ్యాసః ।

ప్రతి॥ స్థితౌ=వైరాగ్యము ద్వారా చిత్తవృత్తులు నిరోధింపగ ఏర్పడిన ఏకాగ్రతను, తత్ర = ఆ ధ్యాన భూమి స్థిరీకరించుట కొరకు చేయు, యత్నః = ప్రయత్నము, అభ్యాసః = అభ్యాసము.

కైవల్యము పొందుటకు, అష్టాంగయోగము ప్రతిపాదించబడి నది. చిత్తవృత్తులను నిరోధించి, చిత్తమును ఏకాగ్రము గావించి, ఏకాగ్రము గావించబడిన 'ప్రత్యయము' పై మనసును, స్థిమితముగా నుండునట్లు చేయు ప్రయత్నము అభ్యాసము. ఇందుకు ప్రాచీన సాంప్ర దాయములలో ఎందరెందరో మహనీయులు కొన్నికొన్ని నియమము లను బోధించి, శిష్యులకు తగిన శిక్షణ నొసంగు చుండెడివారు. ఇట్టి సాధనముల నన్నిటిని చక్కగ గమనించి, అభ్యసించి, వాటిని అష్టాంగయోగములో సూత్రకారుడు చేర్చినాడు.

సూ॥ 14. సతు దీర్ఘకాల నైరంతర్య సత్కారాసేవితో దృఢ భూమిః ।

ప్రతిపదార్థము:- సతు = పై సూత్రములో చెప్పబడిన అభ్యాసము. దీర్ఘకాల = చాలాకాలము, నైరంతర్య = నిరంతరము అవిచ్ఛిన్నముగ, సత్కారా = భక్తిశ్రద్ధవిశ్వాసములతో, సేవితః = సేవించుటవలన, దృఢభూమిః = స్థిరత్వము ఏర్పడును.

తా॥ చిత్తమును బాహ్య విషయములపై ప్రవర్తించనీయక, ధ్యానభూమికపై ఏకాగ్రము గావించి ధ్యాన ధారణ సమాధి స్థితు లను పొందుటకు బహుకాలము అవిచ్ఛిన్నముగ శ్రద్ధాసక్తులతో, ప్రయత్నము చేయవలెను.

అభ్యాసము:- కొందరు సాధకులు ఆదిలో చాల వుత్సాహముతో అభ్యాసముగావింతురు. శీఘ్రకాలములో కైవల్యప్రాప్తి కావలెనను తీవ్రేచ్ఛగలిగియుందురు. కాని ఈ సిద్ధి అంత సులభముగా, శీఘ్ర ముగ లభించదు. ఆ కారణముచేత, వారి ఉత్సాహము నీరు కారి పోయి అనతికాలములో వారు అభ్యాసమును విరమింతురు. మరి కొందరు కొంతకాలము అభ్యాసము గావించి, కొంతకాలము విర మించి మరల ప్రారంభింతురు. అట్టివారికి ఫలము లభించదు.

ఈ యభ్యాసము బహుకాలము, శ్రద్ధాశక్తులతో, అవిచ్ఛిన్నముగ గావించవలెను. దీర్ఘకాలమనగా ఎంతకాలము? ఆజన్మాంతము గావించవలెను. అక్కడికి లక్ష్యము చేరలేక పోయిన, మరుజన్మలో కూడ ఈ అభ్యాసము కొనసాగించవలెను. కనుకనే ఈసాధనలో వేయిలో ఏ వొక్కరో లక్ష్యసిద్ధి నొందగలుగుదురు. "మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే" అని భగవద్గీత చెప్పుచున్నది.

ఈ యభ్యాసము నిరంతరము చేయవలెను. కొన్ని దినములు చేసి మాని, మరల ప్రారంభించుట తగదు. దేహవ్యాయామము చేయువారు కొంతకాలము అభ్యాసము చేయుటచే, వారి దేహాంగములు అభివృద్ధిచెందును కాని అభ్యాసము విరమించుటచే దేహాంగములు పూర్వస్థితికి వచ్చును మరల ఈ స్థితికి రావలెనన్న మరల ప్రారంభించవలెను. యోగాభ్యాసముకూడ ఇట్టిదే. ప్రతినిత్యము అభ్యాసము చేయుచుండవలెను. మధ్యన విచ్ఛిన్నముండరాదు. విచ్ఛిన్నత కలుగు చుండిన, కేవలము కాలము వృథాయగునే గాని ఫలము లభించదు,

సాధకుడు తన దేహములను పరిశుద్ధముగ నుంచుకొనవలెను. ఇంద్రియములను తన వశము నందుంచుకొనుటకు సర్వదా ప్రయత్నము జరుగుచునే యుండవలెను. ఉద్రేకములు ఉద్వేగముల వేగమును తగ్గించుకొనవలెను. సామాన్య జీవితములోని పలుసంఘటనలు, అభ్యాసమునకు ఒరపిడి రాళ్ళవంటివి. ప్రతి సంఘటనను నెమ్మదిగ ప్రశాంత చిత్తముతో ఎదుర్కొనవలెను. నిత్య జీవితములో కోపతాపములు, లోభమత్సరములుసంభవించినపుడు, ఇచ్ఛాశక్తితో వివేకముతో వాటిని ఉపశమింప జేసుకొనవలెను. రాగిపాత్రను ప్రతిదినము శుభ్రము చేయుచున్ననే అది కాంతివంతముగ నుండును. ఒక దినము ఏమరుపాటు చెందిన అది చిలుము పట్టి కాంతి విహీనమగును. కనుక జీవితములో అనుక్షణము జాగరూకతతో వివేక

ముతో ఆత్మ పరీక్ష గావించుకొనుచు అంతరంగమును పరిశుద్ధముగ నుండునట్లు ప్రయత్నము చేయుట. సదభ్యాసము యొక్క లక్షణము.

సామాన్యముగు ప్రాపంచిక విషయములలో విజయము సాధించవలసిన ఎంతో కృషి, పట్టుదల అవసరము. కాన కైవల్య ప్రాప్తి, నిరతిశయ ఆనందము ప్రాప్తింపజేయు నిచ్ఛగల సాధకుల కెన్ని రెట్లు తీవ్రతర సాధన మవసరమో గుర్తించనగును. ఈ సాధన గావించువారికి వారి లక్ష్యముపై పరమమైన విశ్వాసము, శ్రద్ధ ఎంతేని అవసరము. కనుకనే సూత్రకారుడు, 'సత్కారాసేవిత' అను పదము నుపయోగించినాడు. సత్కారమనగ, భక్తి, శ్రద్ధ, విశ్వాసము.

యోగసాధన గావించిన సమాధి, తదుపరి కైవల్యము తప్పక లభించునను దృఢతర విశ్వాసము కలిగియుండవలెను. కైవల్యసిద్ధి మానవ జీవిత పరాకాష్ఠ. మహాత్ము లెందరో ఈ మార్గమున పయనించి, లక్ష్యమును పొంది, మనకు మార్గదర్శకులైనారు. కనుక పెద్దలు నడచిన త్రోవపై అచంచల విశ్వాసముండవలెను. భక్తి విశ్వాసముతో పాటు శ్రద్ధ యుండుట అత్యంత అవసరము. అధ్యయనము వలన తెలిసికొనిన విషయములను, చక్కగ అవగతము చేసుకొని, వాటిని 'తు' 'చ' తప్పక ఆచరణలో పెట్టుటయే శ్రద్ధ.

సామాన్య ప్రాపంచిక జీవితములో ఈ సాధన సాధ్యమా! సాధ్యమే. కాని కష్టసాధ్యము. జాగరూకతతో నిష్పక్ష పాతముగ ఆత్మ పరీక్షగావించుకొనుచు, మెల్ల మెల్లగ, గమనించిన లోపములను సవరించుకొనుచు, ప్రాపంచిక విషయములపై ఆసక్తిని నెమ్మది నెమ్మదిగ తగ్గించుకొనుచు, సాధనకు ప్రతిబంధకములైన అంతరాయములను నెమ్మది నెమ్మదిగ తొలగించుకొనుచు పోవుట, సాధకుని లక్షణము. తీవ్రేచ్ఛగలవారు ప్రాపంచిక విషయములకు దూరముగ నుండుట కొరకు, ఏకాంతవాసము నపేక్షించి, ఆశ్రమములకు వెళ్ళి, సాధనము గావించుచుందురు.

ఎన్నో జన్మలలో చేసిన దుష్కర్మ ఫలితములు, యోగసాధకునకు అభ్యంతరములుగా ఏర్పడును. కాని ఇచ్ఛాబలముతో, ధైర్యముతో, త్యాగబుద్ధితో, ఈ ప్రారబ్ధకర్మవలన ఏర్పడిన ప్రతిబంధములను తరించవచ్చును. ఇందుకు నిదర్శనము; ఈ మార్గములో పయనించి లక్ష్యమును చేరిన, మహనీయుల జీవితములే. ఈ లక్ష్యసిద్ధి, ఈ జన్మలో లభించక పోవచ్చును. కొన్ని జన్మలు పట్టవచ్చును. ఈ విషయమును గుర్తించి సాధన గావించవలెను. ఒక వేళ యోగభ్రష్టుడైన కావచ్చును. కాని, నిరుత్సాహము పొంద పనిలేదు. ఈ సంశయమునకు గీతాచార్యుడిచ్చిన సమాధానము సాధకున కెంతో ఉత్సాహము నిచ్చును.

శ్లో॥ ప్రాప్య పుణ్యకృతాన్ లోకాన్ ఉషిత్వా శాశ్వతీస్సమాః।
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే॥

శ్లో॥ అథవా యోగినామేవ కులేభవతి ధీమతాం।
ఏతద్ధి దుర్లభ తరం లోకేజన్మ యదీదృశమ్॥

(6. అ - 41, 42)

యోగభ్రష్టుడు, మరణానంతరము తాను చేసిన పుణ్యకర్మ ఫలముగ స్వర్గసుఖముల ననుభవించి, మరుజన్మలో శుచిగల శ్రీమంతుల గృహములలో జన్మించును, లేదా భోగ వాసనలకు దూరులై ఆధ్యాత్మిక మార్గమునందే ప్రముఖ వాసనలున్న యోగుల వంశములలోజన్మించి, తన సాధనను మరింత తీవ్రము చేసి, సత్వరముగ యోగసిద్ధిని పొందును. కాని ఇట్టి జన్మ దుర్లభము.

సూ॥ 15. దృష్టానుశ్రవక విషయ వితృష్ణస్య వశీకార సంజ్ఞా వైరాగ్యమ్॥

ప్రతిపదార్థము:- దృష్టవిషయే = ఇంద్రియార్థములందు; (ఇహ విషయములందు) అనుశ్రవక విషయే = వేదవిదిత పారలౌకిక

విషయములందు; వితృష్ణస్య = ఆశలుడిగిన యోగియు; వశీకార సంజ్ఞా = వశీకరణము అను పేరుగలది, వైరాగ్యమ్ = వైరాగ్య మనబడును.

తా॥ ఇహపర భోగములు పొందవలెననెడి కోరికలను వశీకరణము చేసుకొను. యోగియొక్క ప్రజ్ఞ, వైరాగ్యమనబడును. ఇహాముత్ర ఫలభోగ విరాగము వైరాగ్యమని నిర్వచించ బడినది.

వివరణ:- వి + రాగము, వి=రాగము లేకుండుట విరాగము. దీనిభావము వైరాగ్యము, రాగము ద్వేషము ఈ రెండు కవలపిల్లల వంటివి. ఒకదానిని విడచి మరియొకటి యుండవు. "సుఖానుశాయీ రాగః" (సాధన పాదము-7) రాగము సుఖము నాశ్రయించును. రాగముద్వేషము, ఒకే నాణెముయొక్క రెండు ముఖములు. రాగద్వేషములు బంధమును కల్గించును. రాగమునకన్న అత్యధికమైన బంధములను, ద్వేషము కల్గించును. కనుక రాగద్వేషములు లేకుండుట వైరాగ్యముయొక్క లక్షణము. కామక్రోధములు, లోభ మోహములు, మదమాత్సర్యములు. - వీటన్నిటికి మూలము సంగము (Attachment) కోరికల నిరోధించి, ద్వంద్వాతీతుడై మెలగగలుగుట, వైరాగ్యలక్షణము, కోరికలు (కామ) రాగము. ఈ రెండు ఒకే కోవకు చెందినది. పరిణామముయొక్క ప్రథమదశలో, రాగములు జీవుని తమస్సునుండి మరలించి, రజోగుణమును (Activity) ప్రోత్సహించినవి. ఇది ప్రవృత్తి మార్గములో జీవుని వికాసమునకు తోడ్పడినది. ఇపుడు జీవుడు నివృత్తి మార్గములో పయనించుచున్నాడు. కనుక రాగ ప్రధానమైన, రజోగుణమును అధిగమించి సత్వగుణ సంపన్నుడు కావలెను మరికొంత పరిణమించిన పిదప సత్వగుణమును తరించి, గుణాతీతుడు కావలసియున్నది. ఈ స్థితిలో, నివృత్తిమార్గములో పయనించుచున్న జీవునకు వైరాగ్యము, జీవగఱ్ఱ.

వైరాగ్యముచే మాత్రమే చిత్తవృత్తి నిరోధము సాధ్యము కాదు. మనసునకుండు రెండు దోషములు మల విక్షేపములు. వైరాగ్యమువలన మలదోషము తొలగును. కాని చిత్త చాంచల్యతి నిరోధించబడదు. అభ్యాసముచేత చిత్తముయొక్క దోషమైన చంచలత నిరోధించవచ్చును.

వైరాగ్యము, ఇహభోగముల పైననేగాక, ఆముష్మిక విషయములయందు గూడ నుండవలెను. ఇవియే అనుశ్రవకీ విషయములని సూత్రములో పేర్కొనబడినది. స్వర్గసుఖములుకూడ అనిత్యములు. పుణ్యఫలితముగ పొందిన స్వర్గసుఖములు, పొందుచురాగా, అది క్షీణించి మరల జన్మనొందక తప్పదు. నిరతిశయ ఆనందమును పొందుట, కైవల్యప్రాప్తి, మానవలక్ష్యము లగుటచే తాత్కాలికములు, దుఃఖకారణములైన ఇహపరసుఖములపై అపేక్ష సంపూర్తిగ వర్జింపవలెను. ఇదియే నిజమగు వైరాగ్యలక్షణము.

"బ్రహ్మాది స్థావరాంతేషు వైరాగ్యం విషయేష్వను।
యథైవ కాక విష్ఠాయాం, వైరాగ్యం తద్ధి నిర్మలం ॥"

అనగా బ్రహ్మలోక పర్యంతముగల ఉత్తమ లోకములలోని విషయములపై కాకి మలమువలె జుగుప్స కల్గియుండుటే నిర్మలమైన వైరాగ్యము.

అనుభవించు భోగములను త్యజించుట (భోగత్యాగేచ్ఛ) భోగములపై అయిష్టత (భోగానరిచ్ఛ) ఈ రెండు వైరాగ్య లక్షణములుగా చెప్పబడినవి.

"వైరాగ్యము నాలుగు విధములని ఆగమికులందురు.

1. యతమాన సంజ్ఞ:- అనగా ఇంద్రియములను విషయములపై ప్రవర్తింప కుండునట్లు చేయుట,

2. వ్యతిరేక సంజ్ఞ:- ఇట్లు యత్నింపగా కొన్ని రాగాది మల దోషములు నివారించబడును, కాని నివారించబడని వాటికి వ్యతి

రేకములైన సద్గుణముల నాశ్రయించి, దుర్గుణముల శమింపజేయుట వ్యతిరేక సంజ్ఞ.

3. ఏకేంద్రియ సంజ్ఞ:- ఇంద్రియములను ఇంద్రియార్థముల నుండి తరలించి ఏకాగ్రత చిత్తము గల్గియుండుట, ఏకేంద్రియసంజ్ఞ,

4 వశీకార సంజ్ఞ:- దివ్య అదివ్యవిషయ సుఖములు అందు బాటులోనున్నను, వానిని ఉపేక్షించుట. దీనినే అపర వైరాగ్యమని కూడ అందురు.

ఈ వశీకార సంజ్ఞ, మంద, మధ్య, తీవ్రములని మూడు విధములు. దారాపుత్ర ధనాది విషయములు. వియోగముచేత సంసారముపై వెగటుగలుగుట, మంద వైరాగ్యము (అభావ విరక్తి) దారాపుత్ర ధనాలున్నను, అవి దుఃఖకారణములు, అనిత్యములని భావించి వాటిపై విముఖత పొందుట మధ్యవైరాగ్యము.

ఈ ఐహిక విషయములేగాక, స్వర్గ సుఖాదులు అనిత్యములు పునర్జన్మను కలిగించునను జ్ఞానముచే ఇహపరభోగములను తిరస్కరించుట. ఇది తీవ్ర వైరాగ్య లక్షణము.

తీవ్ర వైరాగ్యము కేవలము జ్ఞానము వలననే పొందనగును. (విచార సాగరమను గ్రంథములో వైరాగ్యమును గురించి విశేషముగ విచారణలు గలవు.)

ప్రయత్నము తీవ్రముగా చేయుచు రాగా, సమస్తములైన ఆకర్షణలపై వైముఖ్యత పొందుటచే, కోరికలుడుగును. కోరికలుడిగిన రాగ ద్వేషముల ప్రభావము క్షీణించును. అపుడు సాధకుడు, తన శరీరములను తన వశమందుంచుకొన గల శక్తి పొందును. విషయములందు ప్రవర్తించుచున్నను, విషయలోలుడు గాక అనాసక్తితో వ్యవహరించును.

వైరాగ్యము కేవలము ప్రపంచమునకు దూరముగ నుండినంతమాత్రమున లభించదు, అడవులలో ఏకాంతవాసము చేయు

చుండినను, మనసు విషయాసక్తమైనపుడు, కేవలము శరీరము మాత్రమే ఏకాంతముగ నుండినట్లగును. ఇచట మరొక విషయము కూడ గమనించవలసి యున్నది. బలవంతముగ కోర్కెలను నిరోధించుటచేత, ఆ కోర్కెలు తాత్కాలికముగా అణిగి యుండినను, సమయము వచ్చినపుడు రెండంతల ఉధృతముతో ఉప్పొంగును. గోచి బిగించినంత మాత్రమున, ఇనుపకచ్చడాలు ధరించినంత మాత్రమున బ్రహ్మచర్య సాధన ఫలించదు. మనసు ఆ సుఖముపై జుగుప్స పొందవలెను. ఇంద్రియములను సంయమ విధానమున స్వాధీనము చేసుకొనవలెను. ఇంద్రియార్థములపై నిజమగు వైమనస్యము విరక్తి లభించిన, ఆ యింద్రియార్థములు కట్టెదుట నుండినను మనసు వాటిపై పరుగులెత్తదు. వాటిపై తటస్థ భావముతో నుండును. వాటిపై రాగము లేదు. ద్వేషము లేదు.

నిత్య జీవితములో కలిగెడి ఆకర్షణలు సాధకునకు ఒరిపిడి రాళ్ళవంటివి. ఈ నిత్య జీవిత ఆకర్షణలకు లొంగకుండిన, కోరికల ఉపేక్షించబడుటచే, అవి క్షీణించును. ఇంద్రియ భోగములు తాత్కాలికములు, దుఃఖ కారణములను జ్ఞానము పొందుటచే, వైరాగ్యము స్వభావ సిద్ధమగును. వైరాగ్యము ఇంద్రియములను కృశింపజేయుటచేతగాని, బలవంతముగ ఇంద్రియములను నిరోధించుట చేతగాని లభించదు. జ్ఞానముచే పొందిన వివేకముచేత ఇంద్రియముల వేగము శమించును. ముఖ్యముగ, ఇంద్రియములకు ప్రభువైన మనసు, స్వాధీనమైన, ఇంద్రియములు తప్పనిసరిగ స్వాధీనమగును. మనసును ఇంద్రియార్థముల నుండి మరలించుటే నిజమగు వైరాగ్యము. ఇట్టి పరావైరాగ్యము సిద్ధించిన సాధకుడు, ఇహపరసుఖముల ఆకర్షణకు లొంగక, తన లక్ష్యమైన కైవల్యమును పొందుటకు తీవ్రతరమైన ప్రయత్నము గావించును.

సూ॥ 16. పరంపురుష ఖ్యాతేర్గుణ వైతృష్ణ్యం।

పురుష ఖ్యాతేః = గుణత్రయాత్మక ప్రకృతికంటె, పురుషుడు శ్రేష్ఠుడు (భిన్నుడు) అని తెలిసికొనుట వలన (కలుగు)

గుణ వైతృష్ణ్యం = గుణవిరక్తి, పరం = పర వైరాగ్య మనబడును.

వివరణ:- పరమ పురుషుడు గుణత్రయాత్మక ప్రకృతికంటె శ్రేష్ఠుడు అని తెలిసికొనుటవలన, గుణ వివర్జితుడై మెలగును. అట్టి స్థితి పరవైరాగ్యముగా ఖ్యాతి నొందినది. వైరాగ్యము అత్యంత తీవ్రమైనపుడు, సాధకుడు త్రిగుణా తీతుడగును. త్రిగుణాతీతుడై పరమ పురుషునితో సన్నిహితుడగుటచే, పరమపురుషుడు పొందు ఆనందమును చవిచూచును. ఒక్కతూరి ఆ పరమానందమును అనుభవించిన తరువాత, విషయభోగములు తుచ్ఛములని భావించును. వాటిపై వితృష్ణకలుగును, జుగుప్స కలుగును. ఆ స్థితియే కైవల్యము' ఈ స్థితిలో కైవల్యము ద్వారా పరమపురుషునితో ఏకత్వమును పొందుటవలన సాధకునకు అఖండ జ్ఞానము లభించును. అదియే ఖ్యాతిగా సూత్రములో పేర్కొనబడినది. ఇట్టి స్థితి పొందినవారికి 'చ్యుతి' కలుగదు. పతనము పొందు దశలన్నిటిని తరించిన సాధకుడు ఆ పరమపురుషునితో ఐక్యము పొందుటచే ఆ పొందిన ఆనందప్రభావ ముచే ప్రకృతిలోని విషయానందము లాతనివలె తుచ్ఛములుగ తోచును.

'ప్రహ్లాదుడు ఈ స్థితిని ఈ విధముగ వర్ణించినాడు.

"అంబుజోదర దివ్య పాదారవింద చింతనామృతపాన విశేష

మత్తచిత్తమేరీతి నితరంబు చేరనేర్చు! ।"

ఈ 16 సూత్రములు సమాధిపాదములో ఒక ఘట్టముగ భావించవచ్చును. ఇందులోని క్రమము —

(1) యోగమనగా చిత్తవృత్తి నిరోధము (2) చిత్తవృత్తి నిరోధము వలన స్వస్వరూపజ్ఞానము లభించును (3) చిత్తవృత్తుల నిరోధము గావించని ఎడల వాటిలో తాదాత్మ్యము నొందును, చిత్తవృత్తులు అయిదు. 5. ప్రమాణ విపర్యయ, వికల్ప, నిద్రా స్మృతి అనునవి చిత్తవృత్తులు, వాటి స్వరూపస్వభావములు తెలియ జేయబడినవి. 12–వ సూత్రములో, చిత్తవృత్తినిరోధము అభ్యాస వైరాగ్యములచే పొందనగునని వివరించబడినది. 13, 14 సూత్ర ములు అభ్యాసమనగానేమో వివరించినది. 15 సూత్రములో వైరాగ్యమును గురించి తెలియజేయబడినది. 16 వ సూత్రములో చిత్తవృత్తి నిరోధములో నిష్ణాతుడైన సాధకుడు కైవల్యమును పొందును. ఆ కైవల్యానందము ఒకతూరి చవి చూచిన సాధకునకును గత ప్రాపంచిక, భోగములు, స్వర్గ భోగములు అతి అల్పముగా తోచుటచే, వాటిపై విముఖత చెందునను విషయము వివరించబడినది.

సంప్రజ్ఞాత సమాధి

సూ॥ 17. వితర్క, విచార, ఆనంద, అస్మితా, స్వరూ పానుగమాత్ సంప్రజ్ఞాతః ।

ప్రతి॥ వితర్క– ప్రశ్నోత్తరములు (పరిప్రశ్న) తర్కములోను (Argumentations of reasoning)

విచార = దీర్ఘముగ, మనసు అంతరాంతరాళములలోనికి వెళ్ళి పరిశోధించుట (Deliberation and reflection)

ఆనంద=ఆనందము (Bliss) – ఆనందమయ కోశమును అధి గమించి, యోచించుట.

అస్మిత = 'నేను' అను భావమును తరించుట.

(Iness, sense of identity, sense of Pure being)

అనుగమాత్ = పై నాల్గింటిని, ఒకదాని తరువాత మరొక స్థితిని పొందుట, సంప్రజ్ఞాతః =సంప్రజ్ఞాత సమాధి అని తెలియనగును.

తాత్పర్యము:- మానవుని ప్రజ్ఞ మనసులోని అంతరాంత రాళములను అధిగమించి, ఆనందమయ కోశమును దాటి, 'అస్మిత' స్థితిని పొందును. ఈ విధమైన ధ్యానాభ్యాసముచే. సాధకుడు సంప్రజ్ఞాత సమాధిని పొందును.


ఈశ్వరాంశ, ప్రవృత్తి మార్గములో పయనించినపుడు ఆను సాదిక, ఆత్మ, బుద్ధి, మన, కామ లోకముల లోనికి చొచ్చుకొని వచ్చి, మానవత్వమును పొంద గల్గినది. అదేక్రమములో సాధకుడు స్థూల, సూక్ష్మ ఉపాధులను కోశములను ఒక్కొక్క దానిని తరించి స్వస్థానము చేరుట, అష్టాంగ యోగముయొక్క లక్ష్యము. నివృత్తి మార్గములో ప్రజ్ఞ, మనసును, స్థూలదేహ పరిధినుండి, తదుపరి, కామలోక పరిధినుండి, వేరుగావించి, మనసును శోధించి, మనసు అవధులను అధిగమించి, విజ్ఞానమయ, ఆనందమయ కోశములను దాటి 'అస్మిత' స్థితికి చేరును. ఈ విధముగ క్రమక్రమముగ తన స్థూల సూక్ష్మ శరీరములను తరించి అస్మిత స్థితిలోని ధర్మమేఘ సమాధిని, తదుపరి కైవల్యమును పొందును.

ప్రజ్ఞ ప్రత్యాహార ధ్యాన ధారణల అభ్యాసముచే, ఒక స్థితి నుండి అంతకన్న సూక్ష్మమగు స్థితిని పొంది, మనసుయొక్క అంత రాంత రాళములలోనికి చొచ్చుకొని పోవును. ఇంత వరకు ప్రజ్ఞ మనసును ఉపకరణము గావించుకొని, ఇంద్రియముల ప్రవృత్తిని, ఉద్రేకముల తీవ్రతను గమనించి, వాటిని అధిగమించి మనసులోనికి చేరును. ఈ వరకు మనసు ద్రష్ట స్థానములో నుండును. ఇప్పుడు ద్రష్టగా నుండిన మనసు దృక్ స్థానమునకు వచ్చినది. ఆత్మావలోకమును గావించుకొనును. తదితర విషయములవైపు రక్షించ బడిన మనసు, వెనుదిరిగి తన్నుతానే చూచుకొనుచున్నది. ఇపుడు దృక్, దృశ్యము రెండు తానే.


